## అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లా..?

**- ఎంపీడీవో కార్యాలయంలో ఎదుట ఎర్రగుంటపల్లి గ్రామస్తుల ఆందోళన**



ఎంపీడీవో కార్యాయంలో ముందు బైఠాయించిన ఎర్రగుంటపల్లి గ్రామస్తులు

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 28 : ఇండ్లు, భూములు ఉన్నోళ్లకు.. అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు రాసిండ్రని మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం ఎర్రగుంటపల్లి గ్రామస్తులు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తమకు నచ్చినోళ్లనే ఎంపిక చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 130 మంది దరఖాస్తు చేసుకుంటే.. అందులో వాళ్లకు అనుకూలంగా ఉన్న 35 మంది కాంగ్రెస్ నాయకులు, వారి బంధువులను ఎంపిక చేశారంటూ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిరుపేదలకు, అర్హులైన వాళ్లందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చాలా సందర్భాల్లో చెప్పారని.. కానీ కాంగ్రెస్ నాయకుల ఆగడాలతో అర్హులకు ఇండ్లు రావడం లేదని మండిపడ్డారు. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మళ్లీ సర్వే చేపడతామని ఎంపీడీవో మోహన్ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన సభకు తరలివచ్చిన జనసందోహం




వరంగల్‌లో నిర్వహించిన సభలో అభివాదం చేస్తున్న కేసీఆర్

# రజతోత్సవ జోష్

## చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ



మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 28: ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుంది. గడిచిన 20 ఏండ్లలో ఇలాంటి సభ ఎప్పుడూ జరుగలేదు. కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా అద్భుతంగా ఉంటుంది. అధికారంలో ఉన్న సమయంలో కూడా ఇంతటి సభను నిర్వహించలేదు. కానీ రజతోత్సవసభను ఎంతో ప్రణాళికతో నిర్వహించారు. మహాగర్జనను తలపించింది. కేసీఆర్ తన ప్రసంగంలో పదేళ్ల అధికారంలో ప్రజలకు చేసిన సేవలు, పనులను గుర్తుకు చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తెలియపరిచారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అవార్డులు, వృద్ధిరేటు, సంపద సృష్టి, తదితర అంశాలను ప్రజలకు చెప్పారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కేసీఆర్ కిట్‌లవంటి పథకాలతో ప్రజలకు చేరువైన విషయాన్ని వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని పనులను కూడా చేసి ప్రజల మన్ననలు అందుకున్నారు. కానీ, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి, ప్రజలను మోసం చేసిందని అందరికీ అర్థమయ్యేలా తన ప్రసంగం కొనసాగింది. ఇచ్చిన హామీలతో పాటు పాలనలో ఫెయిల్ అయ్యారని, తద్వారా తెలంగాణ ప్రజానీకం అవస్థలు పడుతోందని బాధపడ్డారు. తాను సాధించిన తెలంగాణ ఇలా అవుతుందని అనుకోలేదని ఆవేదన చెందారు. బుల్డోజర్లతో పేదల ఇండ్లను కూల్చుడు, ప్రశ్నించేవారిపై కేసులు పెట్టుడు, అస్తవ్యస్థంగా పాలనను సాగించడంపట్ల కేసీఆర్ మండిపడ్డారు. ప్రజలంతా బీఆర్ఎస్‌నే కోరుకుంటున్నారని, రానున్న రోజుల్లో శ్రేణులు ప్రజల మధ్యే ఉంటూ, సమస్యల పరిష్కారం కోసం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయం. ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారు.

**- నడిపెల్లి దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల**

## వరంగల్ సభ సక్సెస్‌తో కేడర్‌లో కొత్త ఉత్సాహం

**● మళ్లీ పూర్వ వైభవం దిశగా అడుగులు ● గ్రామాల్లో విస్తృతంగా చర్చ**

మంచిర్యాల, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) :ఉమ్మడి వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ సక్సెస్ కావడంతో ఆ పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సభకు నాయకులు, కార్యకర్తలతోపాటు వేలాది మంది తెలంగాణవాదులు, ఉద్యమ సానుభూతిపరులు, కేసీఆర్ కేటీఆర్ అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఇతర పార్టీలకు భిన్నంగా వరంగల్ తరలి వెళ్లేందుకు చాలామంది స్వచ్ఛందంగా ముందుకు రావడంపై బీఆర్ఎస్‌పై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్న సంకేతాలు కనిపించాయి. చాలా మంది పార్టీ కార్యకర్తలు రజతోత్సవ సభలో పాల్గొనేందుకు తమ సొంత వాహనాల్లో వెళ్లి కేసీఆర్‌పై అభిమానాన్ని చాటుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిగా తరలి వచ్చిన ఈ సభలో పార్టీ జాతీయ అధ్యక్షులు కేసీఆర్ చేసిన ప్రసంగం అందరిని ఎంతగానో ఆకట్టుకున్నది. కేసీఆర్ దిశా నిర్ధేశంతో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నేతలంతా సిద్ధమవుతుతున్నారు. ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో లక్షలాదిగా జనం తరలిరావడంతో అధికార కాంగ్రెస్‌తోపాటు బీజేపీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లా నుంచి వేలాది మంది వరంగల్‌కు తరలివెళ్లడాన్ని ఇక్కడి ఆ రెండు పార్టీల నేతలు తట్టుకోలేకపోతున్నారు. ఎంతమంది వెళ్లారనే దానిపై తమ అనుచరులతో ఆరా తీసినట్లు తెలిసింది. రజతోత్సవ సభలో కాంగ్రెస్, బీజేపీలపై కేసీఆర్ చేసిన విమర్శల దాడితో పాటు గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అసలు రంగును బయట పెట్టడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. సభ కనీవినీ ఎరుగని రీతిలో సక్సెస్ కావడం, ప్రజలు టీవీలు, సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోయి కేసీఆర్ స్పీచ్‌ను ఆసక్తిగా వినడంపై కాంగ్రెస్, బీజేపీలు సమీక్షించుకుంటున్నట్లు సమాచారం. ఆయా పార్టీల ముఖ్య నాయకులు గ్రామీణ స్థాయిలో సభకు వెళ్లిన వారి వివరాలను ఆరా తీస్తుండడం గమనార్హం. ముఖ్యంగా బీఆర్ఎస్ సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ పార్టీలో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అభిప్రాయ బేధాలు, గ్రూపు తగాదాలు, అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్న కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్ సభ సక్సెస్‌ను జీర్ణించుకోలేకపోతున్నాయి

### ఊపిరి పోసిన కేసీఆర్ ప్రసంగం

ఎల్కతుర్తి బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దాదాపు గంటకు పైగా ప్రసంగించిన తీరు బీఆర్ఎస్ కేడర్లో ఊపుని చ్చింది. ముఖ్యంగా బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రాధాన్యతను వివరించడమే కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై విరుచుకు పడ్డారు. బీజేపీ వైఖరిపైనా ఆయన దుమ్మెత్తి పోశారు. ఈ రెండు పార్టీలపై కేసీఆర్ చేసిన విమర్శలు జనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. కేసీఆర్ మాటలకు బహిరంగ సభ ప్రాంగణం చప్పట్లతో మారుమోగి పోయింది. ఆ బహిరంగ సభ దృశ్యాలను టీవీల్లో చూసిన సాధారణ ప్రజలు కేసీఆర్ ప్రసంగానికి మంత్రముగ్ధులయ్యారు.

## ఎల్కతుర్తి సభ స్ఫూర్తి నింపింది



మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ పార్టీశ్రేణులు, ప్రజల్లో స్ఫూర్తి నింపింది. కనీవినీ ఎరుగని రీతిలో సాగిన ఈ సభతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంపొందింది. ప్రజలకు ఈ రజతోత్సవ సభ ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. తమవెంట బీఆర్ఎస్ పార్టీ ఉందని, కేసీఆర్ ఉన్నాడన్న నమ్మకాన్ని ఈ సభ ద్వారా ప్రజానీకానికి తెలియజెప్పారు. ప్రస్తుతం ప్రజలంతా బీఆర్ఎస్‌నే కోరుకుంటున్నారు. ఏడాదిన్నరగా ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రజతోత్సవ సభలో చేసిన ప్రసంగం అద్భుతంగా ఉంది. కోట్లాదిమంది ప్రజలు ఆయన ప్రసంగాన్ని విన్నారు. తాను రాష్ట్రం కోసం, తెలంగాణ ప్రజల కోసం చేసిన పనులను వివరించారు. అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలకు చేస్తున్న మోసాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగుచెందారు. మళ్లా కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారు.

**- దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే, బెల్లంపల్లి**

# చీకటి బతుకులు

**● విద్యుత్ వెలుగులు చూడని నాయికపుగూడ గ్రామం ● దశాబ్దాలుగా మారని ఆదివాసుల జీవితాలు**
**● గతంలో సోలార్ దీపాలు ఏర్పాటు చేసినా.. నాలుగు నెలలకే కనుమరుగు**
**● తాగేందుకు చెలిమెల నీరే దిక్కు ● అష్టకష్టాలు పడుతున్నా పట్టించుకోని సర్కారు**

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలోనున్న ఆ గిరిజన గ్రామం విద్యుత్ వెలుగులకు నోచుకోక చీకట్లోనే మగ్గుతున్నది. గతంలో సోలార్ దీపాలు ఏర్పాటు చేసినా.. మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది. దశాబ్దాలుగా అష్టకష్టాలు పడుతూ బతుకు లీడుస్తున్నా తమను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అడవి బిడ్డల్లో ఆవేదన వ్యక్తమవుతున్నది.

### అనుమతించని అటవీశాఖ..

తిర్యాణి మండలం నాయికపుగూడ గ్రామంలో నివసించే వారంతా ఆదివాసీలే.. ఇక్కడ దాదాపు 16 కుటుంబాలు ఉండగా, 80 మంది నివాసముంటున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం ఏర్పడిన ఈ గ్రామంలో ఇప్పటి వరకూ కరెంటు సౌకర్యం లేదు. ఇందుకోసం విద్యుత్ శాఖ ప్రయత్నించినప్పటికీ అటవీ శాఖ అధికారులు విద్యుత్‌లేన్‌లు, స్తంభాలు వేసేందుకు అనుమతించడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో గంటపాటు కరెంటు పోతేనే భరించలేని పరిస్థితి. ఇక ఒక రోజు కరెంటు లేకపోతే సెల్‌ఫోన్‌లు మూగబోయి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి తల్లడిల్లిపోతుంటాం.. అలాంటిది ఇక్కడి ఆదివాసులు దశాబ్దాలుగా చీకట్లోనే మగ్గిపోతున్నారు.

### పనిచేయని సోలార్ విద్యుత్ దీపాలు

ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నాలుగేళ్ల క్రితం ఈ గ్రామంలో సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. కానీ.. నాలుగు నెలలకే గాలివానల కారణంగా వైర్లు తెగిపోయాయి. సోలార్ ఫలకాలు విరిగిపోయాయి. ఈ విషయాన్ని ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు.



నాయికపుగూడలో ఏర్పాటు చేసిన సోలార్ పలకాలు ఎగిరిపోవడంతో మిగిలిన స్తంభాలు

### వాగు నీరే గతి..

నాయికపుగూడ గ్రామంలో తీవ్రమైన తాగు నీటి సమస్య నెలకొంది. సమీపంలోని వాగులోని నీళ్లు చెత్తాచెదారంతో కలుషితంగా మారాయి. తప్పనిసరి పరిస్థితుల్లో చెలిమెలు తవ్వుకొని తాగు నీరు తెచ్చుకొని తాగాల్సి వస్తున్నదని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు చొరవ తీసుకొని తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

### అటవీ శాఖ కార్యాలయం ఎదుట మౌన నిరసన

తమ గ్రామానికి విద్యుత్ లేన్ వేయకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారంటూ నాయికపుగూడ గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయం ముందు మౌనంగా నిరసన చేపట్టారు. నిత్యం చీకట్లో క్రూర జంతువుల మధ్య భయంభయంగా గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



వాగులోని చెలిమె నుంచి నీటిని తోడుకుంటున్న గిరిజనులు



వాగులో నుంచి బిందెల్లో నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు



అటవీ శాఖ కార్యాలయం ముందు మౌనంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు

## ఇందిరమ్మ ఇండ్లు పేదోళ్లకు ఇవ్వరా?

**లంబాడీతండా(ధర్మారావుపేటలో)లో అధికారులను నిలదీసిన గ్రామస్తులు**



అధికారులను నిలదీస్తున్న మహిళలు, గ్రామస్తులు

కాసిపేట, ఏప్రిల్ 28 : 'ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ నాయకులు చెప్పినోళ్లకేనా.. మాలాంటి పేదోళ్లకు ఇవ్వరా' అంటూ కాసిపేట మండలం లంబాడీతండా(ధర్మారావుపేట) వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం గ్రామానికి వచ్చిన అధికారులను మహిళలు, గ్రామస్తులు అడ్డుకొని నిలదీశారు. నాయకులు, వారి చుట్టాలే అర్హుల లిస్టులో ఉన్నారని మండిపడ్డారు. అర్హులమైన తమ పేర్లు లిస్టులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్లు వస్తున్నాయంటే ఆనంద పడ్డామని, కానీ ఇలా మోసం చేస్తారనుకోలేదని, అర్హులైన పేదల పేర్లు లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు.

## యూనివర్సల్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు




మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 28 : అంతర్జాతీయ సహకార సంవత్సరము-2025 సందర్భంగా సోమవారం మంచిర్యాలలోని యూనివర్సల్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా సహకార అధికారి మోహన్, బ్యాంకు చైర్మన్ వీ వినయ్‌కుమార్, ఇన్‌చార్జి సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి, జిల్లా సహకార అధికారి బీ. మోహన్ పాల్గొని లోను రికవరీ గురించి సభ్యులకు వివరించారు. తమ బ్యాంకు చిన్న.. మధ్య తరగతి కుటుంబాలకు అండగా ఉంటూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఈ సదస్సులో బ్యాంకు డైరెక్టర్లు కే.సుబ్రహ్మణ్యేశ్వర రావు, కృష్ణమూర్తి, ప్రసాదరావు, శ్రీదేవి, రాయలింగు, భాను ప్రకాశ్, బక్కయ్య, రత్నం, సుశీల, విజయలక్ష్మి, ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.